క్లుప్తంగా

నూతన భవనంలోకి బ్యాంకు కార్యాలయం

ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో ఉన్న చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌ను నూతన భవనంలోకి మారుతున్నట్లు బ్యాంక్ మేనేజర్ డి.రాజేష్ తెలిపారు. ప్రస్తుతం స్థానిక రామాలయ వీధిలో నిర్వహిస్తున్నామని, కారంపూడి రోడ్డులో నూతన భవనాన్ని అద్దెకు తీసుకొని ఈ నెల 19వ తారీఖు నూతన భవనంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్యాంక్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. కనుక ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు, ఖాతాదారులు గమనించాలని బ్యాంక్ మేనేజర్ రాజేష్ పేర్కొన్నారు.

పాడి రైతులకు రుణాలు

శావల్యాపురం: జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా పాడి రైతులు అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజరు ఐ.విశ్వనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ కార్యక్రమంలో భాగంగా రైతు ఆదాయం ఆధారంగా ఒక్కో రైతుకు రూ. లక్ష నుంచి 2 లక్షల వరకు రుణాలు తక్కువ వడ్డీకు ఇస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 750 మంది అర్హత కలిగిన కల్గిన రైతులకు రుణాలను మంజూరు చేశామని, ఈనెలలో అత్యధికంగా ఇప్పటి వరకు 200 మంది రైతులకు రుణాలను మంజూరు చేశామన్నారు. 7వ జగనన్న తోడు పథకంలో భాగంగా చిరువ్యాపారులకు బ్రాంచ్ పరిధిలోని పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు 250 మంది లబ్ధిదారులకు రుణాలను వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశామన్నారు. ఆయనతో పాటు ఫీల్డ్ ఆఫీసర్ గుబ్బల సుధీర్‌బాబు, ప్రదీప్ చంద్ర, రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు మండల సమావేశం

నాదెండ్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

గోవిందు మాస్టర్‌కు పురస్కారం



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలం ఏనుగుపాలెం గ్రామానికి చెందిన జి.గోవిందు మాస్టర్‌కు ఉషోదయ ఫౌండేషన్ వారు బోయి భీమన్న అవార్డును అందజేశారు. గోవిందు వినుకొండ పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పౌరాణిక సత్య హరిచంద్ర నాటక ప్రదర్శనలో పాల్గొనేవారు. తిరుపతి జిల్లాలోని బికరాపేటకు చెందిన ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమంలో గోవిందు మాస్టర్‌కు బెస్ట్ డ్రామా ఆర్టిస్ట్ అవార్డు విభాగంలో బోయి భీమన్న స్మారక జాతీయ పురస్కారాన్ని అందజేసి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పురస్కారం పొందిన గోవిందు మాస్టర్‌ను పట్టణానికి చెందిన కళాకారులు, ప్రముఖులు అభినందించారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముగ్గురిపై కేసు

నాదెండ్ల: మండలంలోని సాతులూరు గ్రామంలో వరకట్న వేధింపులకు పాల్పడిన ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జె బలరామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు సాతులూరు గ్రామానికి చెందిన మాతంగి మౌనిక 2021లో పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణతో వివాహమైంది. వివాహ సమయంలో రూ.2 లక్షల నగదు, 6 గ్రాముల బంగారం, ఇంటి సామానులు ముట్టజెప్పారు. గ్రామ పంచా యతీ పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తోంది. గత కొంతకాలంగా భర్త లక్ష్మీనారా యణ, నాగేంద్రం, భర్త మేనమామైన కాశిమళ్ళబ్రహ్మయ్య, పుట్టింటి నుండి నగదు తీసుకురావాలని మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారు. దీనిపై సోమవారం పోలీసులకు ఫిర్యా దు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన సంఘీయులు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నూర్ భాషా సంఘీయులు

నరసరావుపేట: గుంటూరులోని పొన్నూరు రోడ్డు ఏపీ ముస్లిం కళాశాలలో ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహించే నూర్ భాషా ముస్లింల సింహగర్జనకు ఆ వర్గీయులు అందరూ హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు షేక్ ఖాజా కోరారు. ఈ మేరకు మంగళవారం ఎన్‌జీవో హోంలో సమావేశం నిర్వహించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావలి, ఏఎస్ఐ కాసిం వీరమస్తాన్, సుభాని, డి.మీరావలి, నరసరావుపేట నూర్ భాషా సంఘ నాయకులు పాల్గొన్నారు.

వైద్యం చెంత.. రోగికి నిశ్చింత

- వేర్వేరు ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- తరలివచ్చిన వైద్య నిపుణులు
- నాడిపట్టి.. రోగం పసిగడుతున్న వైద్యులు



అల్లూరివారిపాలెంలో వైద్య శిబిరం వద్ద పేర్లు నమోదు చేసుకుంటున్న గ్రామస్తులు

నరసరావుపేట రూరల్: మండలంలోని అల్లూరివారిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న 284 మంది శిబిరానికి హాజరుకాగా వీరిలో 163 మంది మహిళలు, 107 మంది పురుషులు, పాఠశాల విద్యార్థులు 14 మంది ఉన్నారు. కంటి సంభందిత సమస్యలతో ఇబ్బందులు పడుతున్న 126 మందికి పరీక్షలు నిర్వహించి 109 మందికి కళ్లజోళ్లు అవసరమని సూచించారు. కోటప్పకొండ, పమిడిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడకల్ ఆఫీసర్ డాక్టర్ మమతప్రియ, డాక్టర్ జోయల్ ప్రసాద్, గైనకాలజిస్ట్ డాక్టర్ కోటేశ్వరి, ఎంస్ జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ చందురెడ్డిలు వైద్యసేవలు అందించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు యాంపాటి వెంకటప్పా రెడ్డి, గ్రామ సర్పంచ్ భవనం నర్సిరెడ్డి, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్‌డీ కె.వి.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి శివారెడ్డిలు శిబిరాన్ని పర్యవేక్షించారు.

కనుమలచెరువులో...

బొల్లాపల్లి: మండలంలోని కనుమలచెరువు సచివాలయ పరిధిలో ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. వెల్లటూరు, బొల్లాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఆర్.శంకర నారాయణ, పి.కృష్ణానాయక్, ప్రత్యేక వైద్యనిపుణులు రేణుక దేవి, అనిరుద్, భార్గవ్‌లు రోగులకు వైద్యచికిత్సలు అందజేశారు. ఈ వైద్య శిబిరంలో 613 మందికి వైద్యచికిత్స నిర్వహించి అనంతరం మందులు అందజేశారు. వీరిలో 115 మందికి కంటి వైద్యచికిత్స చేశారు. 23 మందిని ఆరోగ్య శ్రీలో భాగంగా మెరుగైన వైద్యం కోసం వివిధ కార్పొరేట్ వైద్యశాలలకు రిఫర్ చేసినట్లు ఈ మేరకు వెల్లటూరు పీహెచ్‌సీ వైద్యులు పి.కృష్ణానాయక్ తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఆర్.పద్మజారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. రోగులకు అవసరమైన, తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సచివాలయ పరిధిలోని కార్యక్రమంలో సర్పంచ్‌లు బి.శ్రీనునాయక్, బి.హనుమా నాయక్, ఎంపీటీసీ బి.వస్త్రం నాయక్ తదితరులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్య, సచివాలయ సిబ్బంది సేవలు అందజేశారు.



వడ్లమూడివారిపాలెం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్లు



ఎండుగుంపాలెంలో వృద్ధుడికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ధీరజ్

ఎండుగుంపాలెంలో ..

నాదెండ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వైద్యానికి భరోసా అని ఎంపీపీ తలతోటి రాణి, జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండలంలోని ఎండుగుంపాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య క్యాంపు నిర్వహించారు. గణపవరం, నాదెండ్ల పీహెచ్‌సీల వైద్యులు ఎల్ ప్రసాద్‌నాయక్, ప్రియాంకతో పాటూ కాటూరి మెడికల్‌వైద్యశాల వైద్య నిపుణులు డాక్టర్ అవినీష్, డాక్టర్ ధీరజ్, ఆప్తమాలజిస్ట్ సంధ్యారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా 523 మందికి 14 రకాల పరీక్షలు నిర్వహించి 105 రకాల మందులు ఉచితంగా అందించారు. వీటితో పాటూ ఈసీజీ, వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షలు నిర్వహించారు. ముగ్గురిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి ఎంపికై నందున వారికి టోకెన్లు అందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ఆవశ్యకత, పలు ఆహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ గోరంట్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ సూరె సరస్వతి, తహసీల్దార్ ఎన్.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, సచివాలయ కన్వీనర్ గుడికందుల శ్రీనివాసరావు, నాయకులు పర్వతనేని బ్రహ్మయ్య, ముక్కపాటి శ్రీనివాసరావు, కందుల బుచ్చయ్య, ఏఎంసీ డైరెక్టర్ దావల రత్నకుమార్, సూరె బుచ్చయ్య మాస్టారు, పంచాయతీ కార్యదర్శి ప్రశాంతి, వీఆర్వో ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



అల్లూరివారిపాలెంలో రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మమతప్రియ



వడ్లమూడివారిపాలెంలో నేత్ర పరీక్ష చేస్తున్న వైద్యబృందం

వడ్లమూడివారిపాలెంలో..

రొంపిచర్ల: మండలంలోని వడ్లమూడివారిపాలెం గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రొంపిచర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో 373 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా అందులో 194 మంది మహిళలు, 179 మంది పురుషులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 43 మంది పిల్లలకు కూడా వైద్య పరీక్షలు చేశారు. 63 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు.

277 మందికి వివిధ రకాల టెస్ట్‌లు నిర్వహించారు. 9 మందికి మెరుగైన చికిత్స అవసరమని నరసరావుపేట వైద్యశాలకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ దుర్గాంబ, జనరల్ మెడిసిన్ డాక్టర్ వేణుగోపాల్, స్థానిక వైద్యులు డాక్టర్ జగన్ నరసింహారెడ్డి, డాక్టర్ బి.మురళీధర్ పాల్గొని సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ గానుగపంట ఉత్తమ్ రెడ్డి పర్యవేక్షించగా, ఆశాలు, అంగన్‌వాడీలు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొని సేవలు అందించారు.



కనుమలచెరువు జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది



ఎండుగుంపాలెంలో ఈసీజీ పరీక్షలు పర్యవేక్షిస్తున్న వైద్య సిబ్బంది



కనుమలచెరువు సచివాలయంలో వైద్యసేవలు అందజేస్తున్న వైద్యులు



అల్లూరివారిపాలెంలో మహిళకు బీపీ పరీక్ష నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ఎండుగుంపాలెంలో ఓపీ నమోదు పత్రాలు అందిస్తున్న సిబ్బంది

పేద పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలి

చిలకలూరిపేట: పండువలు నిరుపేద పిల్లల జీవితాల్లో వెలుగులు నింపాలని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కంది మళ్ల జయమ్మ చెప్పారు. ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో దసరా పండుగను పురస్కరించుకొని నిరుపేదలు నివసించే శాంతినగర్, రూత్‌డైక్‌మెన్‌కాలనీ, జాలయ్యకాలనీలకు చెందిన 60 మంది పేద పిల్లలకు రూ. 30 వేలు విలువ చేసే కొత్త బట్టలు, పండ్లు, బిస్కెట్లు, చాక్లెట్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు నిరుపేదల సంక్షేమానికి కృషి చేయాలని చెప్పారు. పిల్లలకు ఆట, పాటలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, సభ్యులు కోలా విజయలక్ష్మి, ఎండీ కరిమా, మారెళ్ల ఇందిరా, నాగభైరు రామసుబ్బాయమ్మ, పావులూరి సంధ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో బాలబాటతో విద్యా సహాయం

నరసరావుపేట: గ్రామీణ ప్రాంతాలలో పేద విద్యార్థులకు బాలబాట ఏర్పాటు చేసి విద్యాపరంగా సహాయం అందిస్తున్నామని కార్ప్స్ సంస్థ పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఎ.సుబ్బారావు అన్నారు. మంగళవారం స్థానిక తొమ్మిదో వార్డు ఎస్టీ కాలనీలో మంగళవారం నిర్వహించిన నరసరావుపేట, ముప్పాళ్ళ మండలాల బాలబాట డెవలప్‌మెంట్ ఆర్గనైజర్లకు నిత్యావసరాల పంపిణీకి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. నరసరావుపేట మండల కో–ఆర్డినేటర్ నూనె ప్రకాశరావు అధ్యక్షత వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ గత ఇరవై మూడేళ్లగా బాలల విద్యాభివృద్ధికి బాలబాటలు పనిచేస్తున్నాయని, ప్రతి యేడాది పేద విద్యార్థులను గురుకులాల్లో చేరడం ద్వారా వారికి మెరుగైన విద్య అందడం వలన డ్రాపౌట్ సంఖ్య తగ్గి కనీస విద్యార్హత స్థాయికి ఎదుగుతారని ఆయన అన్నారు.

పండుగల వేళ జాగ్రత్త

సత్తెనపల్లి: దసరా పండుగ సెలవుల నేపథ్యంలో చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీస్ యంత్రాంగం చర్యలు చేపడుతుందని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలోని పట్టణం, మండల కేంద్రాలు, గ్రామాల నుంచి కుటుంబ సమేతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలన్నారు

కోడిపందేల నిర్వాహకుల అరెస్ట్

నకరికల్లు: రహస్యంగా కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ ఎ.బాలకృష్ణ మంగళవారం తెలిపారు. మండలంలోని త్రిపురాపురం గ్రామశివారులో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందిందన్నారు. ఈ మేరకు దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని అన్నారు. వారి వద్ద నగదు సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి ఒకరి మృతి



మృతి చెందిన లింగారావు

రొంపిచర్ల : వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో అన్నవరం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలుఇలా ఉన్నాయి. ఆ గ్రామానికి చెందిన తిరువీధుల లింగారావు(45) వ్యవసాయ పనుల నిమిత్తం తన పొలానికి ట్రాక్టర్ నడుపుతూ వెళ్తున్నారు. వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ తన పొలం సమీపంలోకి రాగానే అదుపుతప్పి రోడ్డు ప్రక్కన గల పంట కాలువలోకి దూసుకుపోయి బోల్తా పడింది. ఈ సంఘటనలో ట్రాక్టర్ తనపై పడటంతో ఊపిరాడక లింగారావు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కాలువలో బోల్తా పడిన ట్రాక్టర్‌ను పొక్లయినర్ సహాయంతో బయటకు తీశారు. అదేవిధంగా ట్రాక్టర్ క్రింద ఉన్న లింగారావు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

సాగర్ జలాలను తాగునీటి చెరువులకు మాత్రమే నింపాలి

సత్తెనపల్లి: సాగర్ జలాలను తాగునీటి చెరువులకు మాత్రమే నింపుకోవాలని ఎస్ఎస్పీ ఈఈ మురళీధర్ చెప్పారు. మంగళవారం జీబీసీలో నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించి సిబ్బందితో కాలువలపై పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మురళీధర్ మాట్లాడుతూ నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి విడుదల చేసిన సాగర్ జలాలను వృథా కాకుండా తాగునీటి చెరువులు నింపుకోవాలన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనతోపాటు ఏఈ సుందరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకర్ పాల్గొన్నారు.

వేర్వేరు ఆటల పోటీలకు యడ్లపాడు విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

యడ్లపాడు: షూటింగ్‌బాల్, నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు యడ్లపాడు జెడ్పీహైస్కూల్ ఎంపికయ్యారు. ఇటీవల చిరుమామిళ్ల గ్రామంలోని జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన షూటింగ్‌బాల్ అండర్–17 బాలుర విభాగంలో పాఠశాలకు చెందిన యు.అభిలాష్, అలాగే చిలకలూరిపేట ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన నెట్‌బాల్ అండర్ –14 బాలుర విభాగంలో జి.ధర్మతేజ, బాలికల విభాగంలో బి.ఎలిజబెత్‌రాణి ఆయా పోటీల్లో తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. దీంతో వీరు ముగ్గురు జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడేందుకు అర్హత సాధించారు. త్వరలో అనంతపురం జిల్లాలో జరిగే షూటింగ్‌బాల్, నెల్లూరు జిల్లాలోని గూడురులో జరిగే నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జి.విజయభారతి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో పాటు వారికి చక్కని శిక్షణ ఇచ్చిన స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ షేక్ అషితున్‌ను అభినందించారు. ఆమెతో పాటు గ్రామ పంచాయతీ సర్పంచ్ కారుచోల హేమ, పీఎం చైర్మన్ కె.వేణుబాబు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జాన్ డేవిడ్ సేవలు ఎంతో విలువైనవి



జాన్‌డేవిడ్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

చిలకలూరిపేట: సమాజంలోని వివిధ వర్గాలకు డాక్టర్ జాన్‌డేవిడ్ అందించిన సేవలు ఎంతో విలువైనవని ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ మహంతి చెప్పారు. ఏఎంజీ, ఫార్‌కార్నర్స్, వేద సంస్థల వ్యవస్థాపకుడు డాక్టర్ జాన్ డేవిడ్ జయంతిని మంగళవారం నిర్వహించారు.

ముందుగా ఏఎంజీ సమీపంలోని డాక్టర్ జాన్ డేవిడ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ జాన్‌డేవిడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మహంతి మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా పేద విద్యార్థులకు విద్యా సౌకర్యాలు కల్పించిన జాన్‌డేవిడ్ చిరస్మరణీయుడని పేర్కొన్నారు.

పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారంలో ఆయన ప్రధాన పాత్ర వహించారని చెప్పారు. ఫార్‌కార్నర్స్ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ జెస్సీ ఎస్ బర్నబాస్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారికి సాయం చేయాలని దేవుడు చూపిన మార్గాన్ని జాన్‌డేవిడ్ అనుసరించారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంజీ సంస్థ సీఏవో మాశిలామణి, కార్మెల్ గాస్పెల్ మినిస్ట్రీస్ కు చెందిన కె.పరిశుద్ధరావు తదితరులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో కౌమారి అలంకరణలో..



బోయపాలెంలో అన్నపూర్ణాదేవిగా..



లింగారావుపాలెంలో లలితా పరమేశ్వరీగా..



గణపవరంలో అన్నపూర్ణాదేవిగా..



వినుకొండలో అమ్మవారు ఇలా..



శావల్యాపురంలో అన్నపూర్ణమ్మగా...



వడ్డెంగుంటలో అన్నపూర్ణదేవిగా..



రొంపిచర్లలో వైష్ణవీ దేవిగా...



వడ్లమూడివారిపాలెంలో అన్నపూర్ణా దేవిగా..



నరసరావుపేటలో గాయత్రీ దేవిగా...



సాతులూరులో అన్నపూర్ణాదేవిగా..



నరసరావుపేటలో కౌమారి దేవిగా...



నరసరావుపేటలో వైష్ణవి దేవిగా...

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మూడవ రోజు అమ్మవారు వేర్వేరు అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. -సాక్షి నెట్‌వర్క్

ఉపాధి అవకాశాలు కల్పించాలి

సత్తెనపల్లి: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, అధిక ధరలు తగ్గించి రేషన్ షాపుల ద్వారా బియ్యం, కందిపప్పుతో పాటు అన్ని ఇతర వస్తువులను పంపిణీ చేయాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ కుమార్ డిమాండ్ చేశారు. దరణికోట విమల, పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, పుట్టినరోజు, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com